

రమణకు పలువురి అభినందన

ప్రజాశక్తి - పెరవలి



ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న రమణ

విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మండలంలోని ఖండవల్లి కో-ఆపరేటివ్ సొసైటీ సిఇఒ పివి.రమణకు 72వ సహకార వారోత్సవాలు సందర్భంగా జిల్లా సహకార శాఖ అధికారి ముళ్లపూడి వెంకటరమణ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు డిసిసిబి బ్రాంచ్ మేనేజర్ ఎన్.నాగేంద్ర సొసైటీ అధ్యక్షుడు భూపతి రాజు రవివర్మ సర్పంచ్ పులిదిండి నాగరాజు అతికాల రామకష్ణమ్మ (శ్రీను) అభినందనలు తెలిపారు

ఇంకా అందని పరిహారం

- నెలైనా అందని తుపాను సాయం
- జిల్లాలో రూ.40. 96 కోట్ల పంట నష్టం
- అయోమయంలో అన్నదాతలు



పంట నష్టాన్ని పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

ప్రజాశక్తి - కొవ్వూరు

మొంథా తుపాను రైతులను కోలుకోని దెబ్బ కొట్టింది. జిల్లా వ్యాప్తంగా 33,262 మంది రైతులకు చెందిన రూ.40.96 కోట్ల విలువైన పంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు లెక్కలు తేల్చారు. పంట నష్టం అంచనాలు పూర్తయి 15 రోజులు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి పరిహారం మాత్రం మంజూరు కావడం లేదు. దీంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. జిల్లావ్యాప్తంగా తుఫాను ప్రభావంతో 41,350 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనాల తయారు చేశారు. దీనిలో అత్యధికంగా 36,507 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు గుర్తించారు. 2,839.25 ఎకరాల్లో మినుము పంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు నిర్ధారించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల ఉద్యాన పంటలు 2005.48 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు అంచనాలు తయారు చేశారు.

33 శాతం నష్టం పైబడితేనే పరిహారం

పంటలో 33 శాతం కంటే అధికంగా నష్టం వాటిల్లితేనే అధికారులు పరిహారానికి అర్హులుగా గుర్తించారు. రూ.40,96,85,097 పంట నష్టం వాటిల్లినట్లుగా ప్రభుత్వానికి అధికారులు నివేదిక పంపారు. వాస్తవానికి ఈ నష్టం రూ.60 కోట్లకు పైనే ఉంటుందని అంచనా. 33శాతం లోపు పంట నష్టం వాటిల్లిన రైతులకు ప్రభుత్వపరంగా ఎలాంటి సాయం అందే పరిస్థితి లేదు. ఈదురు గాలుల ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వరి పంట అనేక చోట్ల నేలవాలింది. దీన్నిపరిగణలోకి తీసుకోకపోవడంతో అనేకమంది రైతులు పంట నష్టం పొందే అవకాశాన్ని కోల్పోయారు. ఒక రైతుకు గరిష్టంగా ఎన్ని ఎకరాల్లో నష్టం వాటిల్లినప్పటికీ పరిహారం మాత్రం ఐదు ఎకరాలకు మాత్రమే అందిస్తారు. ఒక రైతుకు ఉద్యాన పంటలతో పాటు వ్యవసాయ పంటలు దెబ్బతింటే పరిహారం అధికంగా వచ్చే ఉద్యాన పంటలను మొదటి ప్రాధాన్యంగా తీసుకుని ఐదు ఎకరాలు గరిష్ట పరిమితి నిర్ణయించి పరిహారం అందిస్తారు.

నెల రోజులైనా అందని పరిహారం

మొంథా తుపాను వచ్చి సుమారు నెల రోజులు కావొస్తుంది. గత నెల 26 నుంచి జిల్లాలో తుపాను ప్రభావం కనిపించింది. ఈనెల ఆరో తేదీ నాటికి అధికారులు పంట నష్టం అంచనాలను తయారు చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. ప్రభుత్వాన్ని నిర్దేశించిన యాప్ లో వివరాలను నమోదు చేశారు. ఇప్పటికే 15 రోజులుపైగా కావాస్తున్నప్పటికీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

ఉద్యాన రైతులకు తీరని నష్టం

జిల్లాలో ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు తీరని నష్టం వాటిల్లింది. తుఫాను ప్రభావంతో ముఖ్యంగా అరటి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈదురు గాలుల ప్రభావానికి తోటలు నేలకు ఒరగడం తో రైతులు తీవ్రంగా ఆర్థికంగా నష్టపోయారు. ఒక్కో రైతుకు ఎకరాకు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లింది. 2053 రైతులకు చెందిన 1855.84 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లింది. 92.59 ఎకరాల్లో కూరగాయ పంటలు దెబ్బతినగా, 33.24 ఎకారాల్లో బొప్పాయి, 17.875 ఎకరాల్లో మిర్చి పంటలు, తమలపాకు కర్రపెండలం పంటలు రెండేసి ఎకరాలు, 1.93 ఎకరాల్లో పూల పంట దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు.

ఏ పంటకు ఎంత నష్టపరిహారం :

వరి, కూరగాయలు పువ్వులు, బొప్పాయి పంటలకు హెక్టారు(2.5ఎకరాలు)కు రూ.25 వేలు చొప్పున, మినుముకు రూ.15వేలు, అరటి, మిర్చి పంటలకు రూ.35వేలు, తమలపాకు పంటకి రూ.75వేలు, కర్ర పెండ్లం హెక్టారుకు రూ.పదివేలు చొప్పున అందించనున్నారు.



మొంథా ప్రభావానికి నేలకొరిగిన అరటి మొక్కలు (ఫైల్)



ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

నివేదికలను ప్రభుత్వానికి పంపించాం...



జిల్లాలో పంట నష్టం వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపించాం. 33 శాతం పైబడి పంట నష్టం వాటిలోని రైతులకు మాత్రమే పరిహారం అందుతుంది. పరిహారానికి సంబంధించిన నిధులు ప్రభుత్వం నుంచి విడుదల కావలసి ఉంది. జిల్లాల నుంచి పంపిన నివేదికలను కమిషనరేట్ కార్యాలయంలో తనిఖీ పూర్తయిన తర్వాత పరిహారం నిధులు విడుదల చేస్తారు.

- ఎస్ మాధవరావు జిల్లా వ్యవసాయ అధికారి



గోదావరిలోకి చేపపిల్లలను వదులుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి

మత్స్యకారుల అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

మత్స్యకారుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని కలెక్టర్ కీర్తి చేకూరి, రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. శుక్రవారం ఉదయం ధవళేశ్వరం కంచర్ల ఘాట్ వద్ద ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని గోదావరిలో 50 లక్షల చేపపిల్లలు, 5 లక్షల రొయ్యపిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ మత్స్యకార కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. చేపల వనరుల పెంపుతో పాటు, లైసెన్స్ వ్యవస్థను కచ్చితంగా అమలు చేయడం ద్వారా ప్రతి కుటుంబాన్ని ప్రభుత్వ పథకాల పరిధిలోకి తీసుకురావడమే లక్ష్యమన్నారు. జిల్లాలో సుమారు 4 వేల మంది వేట వృత్తిలో ఉన్నప్పటికీ, అనేక మంది లైసెన్స్ లేకుండా పని చేస్తున్నారన్నారు. ఈ నెలాఖరులోగా ప్రతి మత్స్యకార కుటుంబం రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలనే దిశగా మత్స్య, రెవెన్యూ శాఖలకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. సచివాలయంలో రూ.120 (బోట్, నెట్), రూ.50 (విసురవల) ఫీజుతో లైసెన్స్ దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని, లైసెన్స్ పొందినవారికి గ్రూప్ ఇన్సూరెన్స్‌తో పాటు అన్ని పథకాల ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ అన్నారు. ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ దేశంలో చేపల ఉత్పత్తిలో 25.64 శాతం, రొయ్యల ఉత్పత్తిలో 75శాతం రాష్ట్రం నుంచి వస్తుందన్నారు. ఆక్వా రంగాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో వేటపై ఆధారపడి ఉన్న దాదాపు రెండువేల కుటుంబాల జీవనాధారాన్ని కాపాడేందుకు చేపలు పెరిగే కాలంలో వేట నిషేధాన్ని కచ్చితంగా అమలు చేస్తున్నామన్నారు. ఈ లోటును భర్తీ చేసేందుకు నాణ్యమైన చేపపిల్లలను నదిలో వదులుతున్నామన్నారు. మొంథా తుఫాన్ వంటి విపత్తుల సమయంలో ఆదాయం కోల్పోయిన మత్స్యకారులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించా మన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలువురికి అవార్డులు, సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ ఆర్.కృష్ణనాయక్, ఫిషరీస్ జెడి ఎన్.నిర్మలా కుమారి, మండల నాయకులు మత్స్యేటి ప్రసాద్, రాష్ట్ర కుమ్మరి శాలివాహన డైరెక్టర్ పండురి అప్పారావు, పుక్కళ్ల రాజు, తలారి మూర్తి, ఎడ్ల మహేష్, గుర్రాల వెంకట్రావు, ఆళ్ల ఆనందరావు, తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, పంచాయితీ కార్యదర్శి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

8 రోజుల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - చాగల్లు

ఆర్‌డిఎస్‌ఎస్ పనుల నిమిత్తం ఈనెల 22 తేదీ నుంచి 28వరకు మండలంలోని గౌరిపల్లి, మల్లవరం, చంద్రవరం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ గ్రామాల్లో త్రీ ఫేస్‌కు ఉదయం 4 గంటల నుండి 9 గంటల వరకు, మిగిలిన బ్యాలెన్స్‌స మధ్యాహ్నం 2 గంటల నుంచి అందిస్తారనిమండల విద్యుత్ శాఖ అధికారి ఎస్.త్రిమూర్తులు తెలిపారు. సింగల్ ఫస్ సరఫరాను ఆర్‌డిఎస్ పనులను దృష్టిలో పెట్టుకుని అవసరం అయినప్పులు నిలుపుదల చేస్తారని తెలిపారు.



డిఆర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారం కోసం వినతి

ప్రజాశక్తి-కడియం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తూర్పుగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో, ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోసం జిల్లా రెవెన్యూ అధికారి తామరాల సీతారామమూర్తిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రధానంగా మెడికల్ అండ్ హెల్త్ విభాగంలో నెలకొన్న సమస్యలను వివరించారు. మెడికల్ విభాగంలో ఖాళీగా ఉన్న వందలాది పోస్టులను భర్తీ చేయాలన్నారు. యూనిఫామ్ అలవెన్స్ పారామెడికల్ సిబ్బందికి తక్షణం ఇవ్వాలన్నారు. ఎఫ్‌ఆర్ఎస్ అటెండెన్స్ పేరుతో షోకాజ్ నోటీసులు ఇవ్వడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉద్యోగుల జీతభత్యాలు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పిహెచ్‌సిల్లో ఉద్యోగులకు అడిషనల్ అలవెన్స్, యూనిఫామ్ అలవెన్స్ చెల్లింపులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గిరి ప్రసాద్ వర్మ, ఉపాధ్యక్షులు, రవికుమార్, నగర అధ్యక్షులు విజయ కుమార్, కోరుకొండ తాలూకా కార్యదర్శి భగవాన్ దాస్, రెవెన్యూ ఉద్యోగులు నాగేశ్వర రావు, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ఐసిఆర్ఐఎస్ఇపై అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



సదస్సులో పాల్గొన్న ప్రిన్సిపల్, శాస్త్రవేత్తలు

ఆర్ట్స్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'జీవనాధార పర్యావరణం కోసం ప్రతిఘటనాత్మక ఆవిష్కరణలు(ఐసిఆర్ఐఎస్ఇ)' అంశంపై రెండు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ప్రారంభోత్సవ సభ ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథి రీజినల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పివి.కృష్ణాజీ హాజరయ్యారు. దేశ విదేశాల నుంచి ప్రఖ్యాత రసాయన శాస్త్రవేత్తలు విచ్చేసి సందేశాలను ఇచ్చారు. సెర్బ్, ఎఎన్ఆర్ఎఫ్ సౌజన్యంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ తెలిపారు. బయో ఆధారిత ఆవిష్కరణలు, గ్రీన్ గవర్నెన్స్ ద్వారా స్థిరమైన పర్యావరణ మార్పుకు దోహదపడుతుందన్నారు. ముఖ్య వక్తగా విచ్చేసిన శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ కెఆర్.ప్రసాద్ సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఇప్పటి వరకూ జరిగిన వివిధ ఆవిష్కరణలను వివరించారు. ఐఐఎస్ఇఆర్ బేర్హంపూర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.ఆదినారాయణ, బెంగళూరులోని బిబిఆర్‌సి సైన్‌జెయిన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌కు చెందిన లీడ్ ఇన్విస్టిగేటర్ డాక్టర్ కె.శ్రీనివాస్, ధర్వాడ్ ఐఐటి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రాజేశ్వరరావు, జైపూర్ ఎంఎన్ఐటి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.సురేష్ పరిశోధనలకు సంబంధించిన పలు విషయాలను వివరించారు. పోస్టర్ ప్రజెంటేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ సదస్సు కన్వీనర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.శ్రీధర్, కో-ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జి.తేజస్విని, రసాయన శాస్త్ర విభాగ అధ్యాపకులు, వివిధ పరిశోధనా సంస్థల పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ల నోటిపై దారుణం : సిఐటియు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం సిటీ

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్‌లను నోటిఫై చేయడాన్ని సిఐటియు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 22న పెద్ద ఎత్తున నోటిఫై చేసిన ఉత్తర్వులను దహనం చేసి నిరసన తెలియజేయాలని కార్మికులకు, కార్మిక సంఘాల నాయకులకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్ పిలుపునిచారు. పెట్టుబడుదారుల ప్రయోజనాలను కాపాడేందుకే బిజెపి ప్రభుత్వం పని చేస్తుందనే విషయం మరోసారి రుజవైందన్నారు.కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ల ప్రయోజనం కోసం నాలుగు లేబర్ కోడ్లను మోడీ ప్రభుత్వం తెచ్చిందన్నారు. బిహార్ ఎన్నికల అనంతరం నోటిఫై చేయడం ద్వారా తన కుటిలత్వాన్ని బయటపెట్టుకుందన్నారు. మోడీ కార్మిక వ్యతిరేక విధానాలపై, లేబర్‌కోడ్‌ల రద్దు కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ప్లాటినం జూబ్లీ ఉత్సవాల జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ



ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం ఏర్పడి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధానోపాధ్యాయులు ప్లాటినం జూబ్లీ ప్రారంభోత్సవ వేడుకలు ఆదివారం కాకినాడలో నిర్వహిస్తున్నామని, వీటిని జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు కోలా సత్యనారాయణ పిలుపునిచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కెవి.రమణారావు, ప్రధాన కార్యదర్శి మంగిన రామారావు, గౌరవ అధ్యక్షుడు టిఎస్.రామానుజన్‌తో కలిసి ఆయన శుక్రవారం మాట్లాడారు. 1950లో సంఘం ఏర్పాటైందన్నారు. 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 23న కాకినాడ కలెక్టరేట్ ఎదురుగా ఉన్న రెవెన్యూ భవన్‌లో ప్లాటినం జూబ్లీ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. లో జిల్లాలోని ప్రధానోపాధ్యాయులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు, ఈ కార్యక్రమంలో సంఘం హెడ్ క్వార్టర్ సెక్రెటరీ ఎస్ఎల్‌వి.రమేష్, స్టేట్ కౌన్సిల్ సభ్యులు ఫణిశేఖర్, గణపతిరావు, సూర్జన్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులను శాంతి చర్చలకు పిలవాలి

హిడ్మా ఎన్ కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి


ప్రజాశక్తి - కొవ్వూరు



ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న న్యూ డెమోక్రసీ నాయకులు

మావోయిస్టులను శాంతి చర్చలకు పిలవాలని, హిడ్మా ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలంటూ సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కొవ్వూరు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద వారు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ ధర్నాను ఉద్దేశించి పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు హైకోర్టు న్యాయవాది నంబూరి శ్రీమన్నారాయణ మాట్లాడారు. పట్టుబడిన వారిని కాల్చి చంపడం అనేది చట్టరీత్యా నేరమమన్నారు. తక్షణం మాహి హిడ్మా తదితరుల ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇంటెలిజెన్స్ బ్యూరో అదుపులో మావోయిస్టు ప్రధాన కార్యదర్శి, అగ్రనేతలు ఉన్నట్లుగా వార్తలు వస్తున్నాయని, తక్షణం వారిని కోర్టులో హాజరు పరచాలని డిమాండ్ చేశారు. శాంతి చర్చలకు మావోయిస్టులు ముందుకు వచ్చారని, ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆపరేషన్ కగార్ పేరుతో జరుపుతున్న హత్యలు అత్యంత అమానవీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పల్లా వెంకట నాయుడు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె.మస్తాన్, అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జల్లి సత్తిబాబు, పిఒడబ్ల్యు జిల్లా నాయకురాలు ఈమని మల్లిక, ఇఫ్టూ రాష్ట్ర నాయకులు పి.నాగేశ్వరరావు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



క్లీన్ అండ్ గ్రీన్ స్పెషల్ డ్రైవ్‌పై శిక్షణ

ప్రజాశక్తి- గోకవరం



బిక్కవోలులో శిక్షణా తరగతులకు హాజరైన సిబ్బంది

గోకవరం ఎంపిడిఒ కార్యాలయంలో మండలంలోని 14 గ్రామపంచాయతీ పరిధిలో క్లాప్ మిత్రులకు క్లీన్ అండ్ గ్రీన్ స్పెషల్ డ్రైవ్‌పై ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఎంపిడిఒ ఎం.గోవిందు, డిప్యూటీ ఎంపిడిఒ భీమేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనిలో భాగంగా అచ్యుతాపురంలో ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు మండలంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన క్లాప్ మిత్రలు 52 మంది, మూడు ట్రాక్టర్లు, 2 వ్యాన్లు, రెండు రిక్షాలు సహాయంతో అచ్యుతాపురం గ్రామ శివారు ప్రాంతంలో విజువల్లీ క్లీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తడి, పొడి చెత్త వేరు చేసే విధానం, డ్రైన్‌లో పూడికతీతలు, ప్రజలతో వ్యవహరించాల్సిన తీరు, ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బత్తుల శ్రీనివాస్, పోలవరం ప్రాజెక్ట్ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఉంగరాల రాములు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ పిట్టా అరుణ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం : థీమ్ -5 లో భాగంగా పచ్చదనం - పరిశుభ్రతపై 15 గ్రామాలకు చెందిన గ్రీన్ అంబాసిడర్లు, క్లాప్ మిత్రలకు శిక్షణ ఇచ్చామని ఇఒపిఆర్‌డి ఆంజనేయ శర్మతెలిపారు. ఉదయం 6 గంటల నుంచి క్షేత్రస్థాయిలో గ్రామాన్ని శుభ్రపరిచారు. అనంతరం వేలివెన్ను సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ అధ్యక్షతన గ్రామంలోని సంపద తయారీ కేంద్రం వద్ద శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపిడిఒ ఎం.శ్రీనివాసరావు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల శానిటేషన్ కోఆర్డినేటర్ కత్తుల ప్రకాష్, పసలపూడి కార్యదర్శి ఎ.శ్రీనివాస్, నాయకులు ఎం.సురేంద్ర, మండల పరిపాలన అధికారి రామారావు తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు : క్లీన్ అండ్ గ్రీన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగముగా శుక్రవారం చాగల్లు మండల పరిధిలోని క్లాప్, షెడ్ మిత్రలకు చాగల్లు చెత్త సంపద కేంద్రంలో ఓరియంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి అధ్యక్షత వహించారు. చాగల్లు పంచాయతీ కార్యదర్శి ఎండి.ఆలీ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. తొలుత చాగల్లు గ్రామపంచాయతీలో విజువల్లీ క్లీన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఇ తిలక్, పంచాయతీ కార్యదర్శులు రాకేష్, నరేంద్ర, మూర్తి, సుబ్బలక్ష్మి, కమలావతి, తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల : మండలంలోని గంట వారి గూడెం శానిటేషన్ నిర్వహణలో ప్రథమ స్థానంలో ఉండాలని టిడిపి డిపి అధ్యక్షులు తాతిన సత్యనారాయణ కోరారు. శుక్రవారం గంటావారిగూడెంలో క్లీన్ అండ్ గ్రీన్‌ను నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, క్లాప్ మిత్రలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సత్యనారాయణ, ఇఒపిఆర్‌డి సింహాద్రి రావు, సర్పంచ్ ఆర్.సుభాషిణి, నాయకులు, తెలుగు యువత నియోజకవర్గ అధికార ప్రతినిధి నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి పాల్గొన్నారు.

గోపాలపురం : తడి, పొడి చెత్తను పంచాయతీ వాహనాలకు అందించాలని ఎంపిడిఒ జి.రాజమనోహర్ అన్నారు. శుక్రవారం జగన్నాథపురంలో క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడారు. మండలంలోని క్లాప్, షెడ్ మిత్రలకు , గ్రీన్ గార్డ్స్‌కు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ ఆర్.సుజాత, సర్పంచ్ రామసత్యవతి, ఉపసర్పంచ్ పసుమర్తి రాఘవచౌదరి తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి తేతల సుమ ఆధ్వర్యంలో పందలపాక పంచాయతీ కార్యదర్శి ఎస్.సురేష్ 13 గ్రామపంచాయతీల క్లాప్ మిత్ర, షెడ్ మిత్రలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాస్, డిప్యూటీ ఎంపిడిఒ ప్రసాద్, ఇఒపిఆర్‌డి జాన్‌మిల్టన్ తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి : క్లీన్ అండ్ గ్రీన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా దేవరపల్లి మండల పరిధిలోని 64 మంది క్లాప్ మిత్రులకు దేవరపల్లి చెత్త సంపద కేంద్రంలో ఓరియెంటేషన్ ట్రైనింగ్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఎల్‌డిఒ ఎ.స్లీవారెడ్డి హాజరయ్యారు. ఎంపిడిఒ నాగార్జున అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కడిమి వీరకుమారి, డిప్యూటీ ఎంపిడిఒ వై.రాజారావు, టిడిపి మండల అధ్యక్షులు ఆండ్రు అనిల్, సొసైటీ ఛైర్మెన్ ఉప్పులూరి రామారావు, వైసిపినాయకులు కడిమి రాజు, దేవరపల్లి కార్యదర్శి రవికిశోర్ తదితరులు పాల్గొన్నారు.


కడియం : మండలంలోని జేగురుపాడులో శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ శిక్షణా కార్యక్రమం జరిగింది. పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్ర, షెడ్డు మిత్రలకు ఈ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ నల్లం శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు అయినవిల్లి శ్రీనివాసరావు, రూప్ చంద్, శ్రీనివాస్ రెడ్డి, రావిపాటి సత్యనారాయణ, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

పెరవలి : పెరవలిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద ఎంపిడిఒ పద్మజ ఆధ్వర్యంలో మండల పరిధిలో ఉన్న గ్రీన్ అంబాసిడర్స్, గ్రీన్ గార్డ్స్ ఎంఆర్‌సిలకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగోలు సీతమ్మజోసెఫ్, పంచాయతీ విస్తరణ అధికారి సిహెచ్.వెంకటరమణ, ఎఒ గంట శ్రీనివాస్, ఎంపిటిసి రాపాక ప్రమీల, కార్యదర్శి ఆకుల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు నిర్మించడమే లక్ష్యం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

పేదలందరికీ సొంతిల్లు ఉండాలనే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని కమిషనర్ రాహుల్ మీనా, ఎంఎల్‌సి సోము వీర్రాజు, ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆనం కళా కేంద్రంలో పిఎంఎవై 2.0 కింద 409 మంది లబ్ధిదారులకు రూ.10.22 కోట్ల విలువైన గృహ రుణ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. నగర కమిషనర్ రాహుల్ మీనా సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఎల్‌సి సోము వీర్రాజు, ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ పిఎంఎవై 2.0లో భాగంగా ప్రభుత్వం అర్బన్ ఏరియాల్లో ఇళ్ల నిర్మాణం కోసం రూ.2.50 లక్షల సాయాన్ని అందిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ. 1.50 లక్షలు ఇస్తుండగా, రాష్ట్ర వాటాగా రూ. లక్ష సాయాన్ని అందిస్తుందన్నారు. ఎస్‌సి, బిసిలకు అదనంగా రూ. 50 వేలు, ఎస్‌టిలకు రూ.75 వేలు., పివిజిటిలకు రూ.లక్ష అదనంగా ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. ఈ మొత్తాన్ని నాలుగు విడతలలో చెల్లిస్తారన్నారు. ఎంఎల్‌సి వీర్రాజు మాట్లాడుతూ పేదలందరికీ సొంత ఇల్లు ఉండాలనేది ప్రధాని కల అన్నారు. ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలో నగరంలో రూ.15 కోట్లతో 3,097 ఇళ్లను నిర్మించి పేదలకు అందించిందన్నారు. లబ్ధిదారులకు ఉచిత ఇసుక పథకం కింద ఒక్కో ఇంటికి సుమారు 20 టన్నుల ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తున్నామన్నారు. నగరంలో 5,800 మందికి కొత్త రైస్ కార్డులు మంజూరు చేశామన్నారు. అర్హులు ఇంకా ఉంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరక్టర్ దాసరి ప్రియ సౌజన్య, పీడీ నాతి బుజ్జి, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరక్టర్ యానాపు యేసు, అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, ఇఇలు అలీ, రాజ్ కుమార్, ఇతర అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


చెక్కు అందిస్తున్న ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎంఎల్‌సి వీర్రాజు

సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు యుపిఎస్‌సి నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు అర్హత గల జిల్లాకు చెందిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి అభ్యర్థులకు విజయవాడలో ఉచిత శిక్షణ అందింస్తామని ఆంధ్రప్రదేశ్ బిసి స్టడీ సర్కిల్ రాజమహేంద్రవరం సంచాలకులు బి.శశాంక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 25 లోగా రాజమహేంద్రవరం బిసి స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు. డిసెంబర్ 5న స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందన్నారు. ఇందులోఉత్తీర్ణత సాధించిన వారికి మెరిట్ ప్రాతిపదికన విజయవాడలో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. అభ్యర్థుల బయోడేటా, 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ మార్కుల జాబితాలు, కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం (తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1,00,000లోపు మాత్రమే), ఆధార్ కార్డు జిరాక్సు కాపీలు, బ్యాంక్ పాస్‌బుక్ ప్రతులు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9494452267, 9000058102, 7032197288, 9393934825 నెంబర్లను సంప్రదించాలన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-దేవరపల్లి

దేవరపల్లి మండలం గౌరీపట్నం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెదాడు. పల్లంట్ల గ్రామానికి చెందిన గొల్లపల్లి రవి గౌరీపట్నం స్టోన్ క్రషర్ వద్ద కార్మికునిగా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం క్రషర్ నుంచి బైకుపై వెళ్తున్నాడు. గౌరీపట్నం వద్దకు చేరుకునే సరికి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ఐషర్ వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవి(35) అక్కడికక్కడే మరణించాడు. ఢీ కొట్టిన తర్వాత వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. రవికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని సూరయ్యపేట, భీమోలు సరిహద్దు ప్రాంతాల్లో సారా తయారీకి నిల్వ ఉంచిన 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని తాళ్లపూడి ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. బెల్లపు ఊటతోపాటు సారా తయారీకి ఉపయోగించే డ్రమ్ములు గిన్నెలు కూడా ధ్వంసం చేశామన్నారు.

దింపు కార్మికుడు మృతి

ప్రజాశక్తి - కాట్రేనికోన

మండల పరిధిలోని దొంతికుర్రులో శుక్రవారం దింపు కార్మికుడు మృతి చెందాడు. దొంతి కుర్రు మెయిన్ రోడ్డు పక్కన కొబ్బరి చెట్టు ఎక్కి దింపు తీస్తుండగా మోకు అదుపుతప్పింది. చెట్టు పైనుంచి వేలాడుతుండగా మరొక దింపు కార్మికుడు చెట్టు ఎక్కే లోపు దింపు కార్మికుడు కర్రి అప్పలరాజు కింద పడి మృతి చెందాడు. స్థానికులు 108కి సమాచారం ఇచ్చారు. 108 అక్కడికి చేరుకునే లోపు కార్మికుడు మరణించినట్లు తెలిపారు. విశాఖపట్నం నుంచి వచ్చి గత కొంతకాలంగా ఈ ప్రాంతంలో అప్పలరాజు దింపులు తీస్తుంటాడని స్థానికులు తెలిపారు. జరిగిన సంఘటనపై బంధువులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

దొంగిలించిన ఆవుదూడ లభ్యం

ప్రజాశక్తి - ఆలమూరు

చొప్పెల్ల గ్రామంలో బుధవారం అర్ధరాత్రి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన పుంగనూరు ఆవు దూడ ఆచూకీ లభ్యమైంది. పినపళ్ల గ్రామానికి చెందిన ఎంపిటిసి సభ్యుడు పెద్దిరెడ్డి పట్టాభిరామన్న రూ.2.50 లక్షల విలువైన తన 15 రోజుల పుంగునూరు ఆవు దూడను ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీనిపై ఎస్ఐ జి.నరేష్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని పరిసర ప్రాంతాల్లోని సిసి కెమెరాలను పరిశీలించారు. అయితే గుర్తు తెలియని దుండంగులు గురువారం అర్ధరాత్రి ఆవు దూడను పశువులపాక వద్ద విడిచిపెట్టి వెళ్లిపోయారు. పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న ఆవు దూడను గమనించిన పశువుల రైతు పట్టాభి దూడను తల్లి చెంతకు చేర్చారు.

ట్రైనింగ్ సర్టిఫికెట్స్ అందజేత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రపంచం మత్స్య దినోత్సవం సందర్భంగా ఆర్ట్స్ కళాశాల జంతు శాస్త్రం విభాగానికి చెందిన 29 మంది విద్యార్థులకు కలెక్టర్ కీర్తి చేకూరి ట్రైనింగ్ సర్టిఫికెట్స్ అందచేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎంఎల్‌ఎ బుచ్చయ్య చౌదరి, ఆర్‌డిఒ కృష్ణనాయక్, ఫిషరీస్ జెడి, ఆర్ట్ కళాశాల జంతు శాస్త్ర విభాగం అధిపతి కె.దుర్గారావు పాలుగోన్నారు.

చెరువు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - బిక్కవోలు

రంగాపురంలో కుడుముల చెరువు అభివృద్ధి పనులను అనపర్తి ఎంఎల్‌ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు అభివృద్ధి ద్వారా ఆయకట్టు కూడా పెరుగుతుందన్నారు. గ్రామాభివృద్ధితో పాటూ పర్యావరణ పరిరక్షణ కూడా చాలా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో రంగాపురం గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అవార్డు అందు కుంటున్న కుందుల

'కుందుల'కు అవార్డు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలో తీపర్రు గ్రామానికి చెందిన ఆక్వా రైతు, టిడిపి సీనియర్ నాయకులు కుందుల వీరవెంకటసత్యనారాయణకు ఆక్వా జిల్లా ఉత్తమ రైతు అవార్డును అందుకున్నారు. ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా ఎంఎల్‌ఎ బుచ్చియ్యచౌదరి, మత్స్య శాఖ జెడి నిర్మల కుమారి చేతుల మీదుగా ఈ వార్డును ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు

పిఎంఎఫ్ఎంఇపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి- గోకవరం

గోకవరం మహిళా సమాఖ్య కార్యాలయంలో ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార క్రమబద్ధీకరణ పథకంపై రిసోర్స్ పర్సన్స్‌కు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రిసోర్స్ పర్సన్ పి.అమిలాసుఖాంత్ పాల్గొని ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార క్రమ బద్ధీకరణ పథకంపై అవగాహన కల్పించారు. ఫుడ్ ప్రాసెసింగ్ చేసుకునే వారికి 30 శాతం సబ్సిడీపై రుణాలు, యంత్రాల ఉపయోగం, ప్రాసెసింగ్, ఎంఎస్ఎంఇ సర్టిఫికెట్లు, టెక్నికల్ గైడ్‌లెన్స్ వంటివాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం జయంతి రాజు, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

జాబ్ మేళాకు 33 మంది ఎంపిక

తాళ్లపూడి : జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో తాళ్లపూడిలోని శ్రీ పైడి ఐటిఐ ప్రాంగణంలో శుక్రవారం జరిగిన జాబ్ మేళాలో 33 మంది ఎంపికయ్యారని జిల్లా ఉపాధి అధికారి హరిచంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ జాబ్ మేళాకు 49 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారన్నారు. పాటిల్ గ్రూప్, రాజేంద్ర ఎనర్జీ సొల్యూషన్‌లో ఖాళీల భర్తీకి ఇంటర్యూలు జరిగాయన్నారు.

సర్వీస్‌లో ఉన్న టీచర్లకు టెట్ నిలిపేయాలి

జనవరి 29న ఢిల్లీలో ఆలిండియా మార్చ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు మేరకు సర్వీస్‌లో ఉన్న టీచర్లకు టెట్ పరీక్ష నిలిపేయాలంటూ జనవరి 29న ఢిల్లీలో టీచర్లతో ఆలిండియా మార్చ్‌ను నిర్వహిస్తున్నామని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం నగరంలో యుటిఎఫ్ హోమ్‌లో జిల్లా కార్యదర్శుల సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సర్వీస్ లో ఉన్న టీచర్లకు టెట్ పరీక్ష రాయాలనే నిబంధన నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. దీనిపై ఇప్పటికే నాలుగు రాష్ట్రాలు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేశాయన్నారు. యుటిఎఫ్ భాగస్వామ్యం ఉన్న జాతీయ స్థాయి ఉపాధ్యాయ సంస్థ ఎస్‌టిఎఫ్ఐ కూడా దీనిపై కోర్టులో ఇంప్లీడ్ అయ్యిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కూడా యుటిఎఫ్ పక్షాన దీనిపై విజ్ఞాపన చేశామన్నారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా రివ్యూ పిటిషన్ వేస్తుందనే ఆశాభావంతో ఉన్నామన్నారు. మరోవైపు పార్లమెంటు సభ్యులను, రాజ్యసభ సభ్యులను కలిసి పార్లమెంటులో విద్యాహక్కు చట్టంలో సవరణకు కూడా ప్రయత్నంచేస్తున్నామన్నారు. కుల,మత, ప్రాంతీయ విభేదాలు లేని ఐక్య సమ సమాజాన్ని నిర్మించుకోవడానికి యుటిఎఫ్ ఉపాధ్యాయులు ముందు ఉండాలన్నారు. ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించుకోవడానికి పోరాటాలకు సిద్ధపడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి, ఐక్య ఉపాధ్యాయ పత్రిక రాష్ట్ర సంపాదకులు సురేష్‌కుమార్, జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు పి.జయకర్, ప్రధాన కార్యదర్శి షరీఫ్, ఉపాధ్యక్షులు విజయ గౌరీ, కోశాధికారి ఇవిఎస్.ప్రసాద్, జిల్లా కార్యదర్శులు ఇ.శ్రీమణి, భవాని, చిలుకూరి శ్రీనివాసరావు, కె.రమేష్, నాగభూషణం, శ్రీనివాసమూర్తి, రమణ, దయానిది, ప్రకాష్, ఎం.శ్రీనివాస్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధయక్షులు వెంకటేశ్వర్లు


అక్షరాస్యత పై చేపట్టిన ర్యాలీలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

అక్షరాస్యతపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-నల్లజర్ల

ప్రకాశరావుపాలెంలో శుక్రవారం వైజ్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో అక్షర విజ్ఞానం, అక్షరాస్యత, అనియత విద్య తదితర అంశాలపై విద్యార్థులు అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ఆవపాడు, ప్రకాశరావుపాలెం, నల్లజర్ల, తెలికచర్ల, సింగరాజుపాలెం గ్రామాల్లో చేపట్టిన ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలో లిటరసీ రేటు, వయోజనుల్లో అక్షరాస్యత, మహిళా అక్షరాస్యత శాతంపై ఇంటింటా తిరిగి వివరాలు సేకరించారు. నిరక్షరాస్యులకు ప్రభుత్వం అందిస్తున్న అక్షరాస్యత కార్యక్రమాలు, కళాశాల తరపున చేపట్టనున్న వయోజన విద్యా కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా సంపద తయారీ కేంద్రాలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

విధి నిర్వహణపై ఉద్యోగులకు ఉన్న చిత్తశుద్ధితో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సైతం ఆహ్లాదకరంగా మార్చవచ్చని ఎంపిడిఒ ఎం.శ్రీనివాసరావు అన్నారు. ఓవైపు చెత్త నుంచి వర్మి కంపోస్ట్ ఎరువు తయారీ చేయడంతో పాటు అమ్మకాలు కూడా సాగించి, అదనపు ఆదాయాన్ని కల్పిస్తున్నారన్నారు. మండలంలోని వేలివెన్ను, వడ్లూరు, చివటం, పసలపూడి, సత్యవాడ, చిలకపాడు, ఉండ్రాజవరం, మోర్త, పాలంగి గ్రామాలలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల వద్ద కేవలం వర్మి కంపోస్ట్ ఎరువు ఉపయోగించి సేంద్రియ పద్ధతిలో పలు రకాల కూరగాయలు, ఆకుకూరలు, పువ్వుల పంటలు పండిస్తున్నారన్నారు. ఈ విధానం ద్వారా చెత్త పక్కనే, ఆహ్లాదాన్ని అందించే పార్కుల మాదిరి ఆహ్లాదాన్ని అందిస్తున్నాయన్నారు. ఈ విధంగా అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది కషి చేసి, గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా చేయాలన్నారు.

నిడదవోలులో న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి - నిడదవోలు

పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నిడదవోలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు మెహబూబ్ మాట్లాడుతూ నందిగూడెంకు చెందిన న్యాయవాఆది పి.గౌతంరెడ్డిపై కొందరు వ్యక్తులు దాడి చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. అలాగే బెల్లంపల్లికి చెందిన సీనియర్ న్యాయవాది పి.అనిల్‌కుమార్ కారును పోలీస్ కానిస్టేబుల్ కోర్టు ఆవరణలోనే ధ్వంసం చేయడం దారుణమన్నారు. ఈ ఘటనలపై నిరసన తెలిపామన్నారు. న్యాయవాదులపై పోలీసుల వైఖరిని ఖండించారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు బార్ అసోసియేషన్ న్యాయవాద సభ్యులందరూ పాల్గొన్నారు.


చెక్కు అందిస్తున్న ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరులోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎంఎల్‌సి ముప్పిడి వెంకటేశ్వరరావు లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. నియోజకవర్గంలో నలుగురు లబ్ధిదారులకు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.3,11,271 విలువ గల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయుడు చౌదరి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని కానూరు, కాకరపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుడ్‌టచ్-బ్యాడ్ టచ్‌లపై బాలికలకు అవగాహనా కార్యక్రమాలను నిర్వహించారు. కొవ్వూరు డిఎస్‌పి జి.దేవకుమార్ ఆదేశాల మేరకు ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శక్తి టీమ్ పాఠశాలలను సందర్శించి సమావేశం నిర్వహించారు. పిఒసిఎస్ఒ చట్టాలు, 112 కాల్స్, శక్తి యాప్, సైబర్ మోసాలు, ఇతర నేరాల గురించి అవగాహన కల్పించారు ఆపద సమయంలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీరామచంద్రమూర్తి, ఉపాధ్యాయులు నేతల విజయకుమార్ పాల్గొన్నారు.


ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న రుడా చైర్మన్ వెంకటరమణచౌదరి

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

రుడా చైర్మన్ వెంకటరమణ చౌదరి

ప్రజాశక్తి - సీతానగరం

నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని అందులో భాగంగానే ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించామని రుడా చైర్మన్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొడ్డు వెంకటరమణచౌదరి అన్నారు. బూరుగుపూడిలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. నియోజకవర్గంలోని సామాన్య ప్రజలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమస్యలను నేరుగా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారదర్శకంగా సేవలందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - సీతానగరం

ప్రజలకు పారదర్శక సేవలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఇందులో భాగంగానే గ్రామ పంచాయతీల్లో ఈ నెల 22న గ్రామ సభలు నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ భారతి అన్నారు. ఈ మేరకు గ్రామ సభలపై పంచాయతీ అభివృద్ధి అధికారులకు ఎంపీడీవో భారతి ఆదేశాలు జారీ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన సేవలను ప్రజల ముందుకు తీసుకువచ్చేందుకు ఈ గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామ సభల్లో కొత్త జాబ్ కార్డు దరఖాస్తులను స్వీకరించి మంజూరు చేస్తారన్నారు. ఇకెవైసి సమస్యల కారణంగా రద్దైన లేదా తొలగించిన జాబ్ కార్డులను మళ్లీ పరిశీలించి అర్హులైన వారికి పునరుద్ధరిస్తారన్నారు. పజలు ఈ గ్రామ సభల్లో పాల్గొని, తమ సమస్యలను నేరుగా అధికారుల దష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు.


లేబర్ కోడ్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు, కార్మికులు

లేబర్ కోడ్ ప్రతుల దహనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యంలో హార్లిక్స్ ఫ్యాక్టరీ వద్ద లేబర్ కోడ్ నోటిఫై పత్రాలను శుక్రవారం దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కర్రి రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. ఆరేళ్లుగా లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికులు పోరాడుతున్నారన్నారు. వారి ఆందోళనలను సైతం పరిగణలోకి తీసుకోకుండా లేబర్ కోడ్‌లను నోటిఫై చేయడం దారుణమన్నారు. లేబర్ కోడ్‌లతో కార్మికులందరూ బానిసలుగా మారతారన్నారు. హక్కులన్నీ హరించవేయబడతాయన్నారు. యూనియన్‌లు పెట్టుకునే అవకాశం కూడా ఉండదన్నారు. కార్మికులకు తీవ్ర అన్యాయం చేసే ఈ నల్ల చట్టాలను రద్దు చేసే వరకు పోరాడతామన్నారు. ఈ నిరసనల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్త తీరుకు నిరసనగా పని ప్రదేశాల్లో బ్లాక్ బ్యాడ్జీలు దరించి నిరసన తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.రంగారావు, సిహెచ్.రామకృష్ణ, ఎస్.దుర్గాప్రసాద్, మారుతి, ముత్యాలరావు, గంగరాజు, జెపి తదితరులు పాల్గొన్నారు

22న జిల్లా వ్యాప్తంగా ఉపాధి గ్రామసభలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 22న ఉపాధి హామీపై గ్రామ సభలు నిర్వహించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.నాగమహేశ్వరరావు శుక్రవారం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు పారదర్శకతను చేరువ చేయడం, సేవలను గ్రామ స్థాయిలోనే అందుబాటులోకి తేవడం ఈ గ్రామ సభల ప్రధాన ఉద్దేశ్యమన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణ అభివద్ధి శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన సేవలను ప్రజల ముందుకు తీసుకువచ్చేందుకు ఈ గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ గ్రామ సభల్లో కొత్త జాబ్ కార్డు దరఖాస్తులను స్వీకరించి మంజూరు చేయాలన్నారు. ఇకెవైసి సమస్యల కారణంగా రద్దు అయిన, లేదా తొలగించిన జాబ్ కార్డులను మళ్లీ పరిశీలించి అర్హులైన వారికి పునరుద్ధరణ చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపాధి కార్మికులు, గ్రామస్తులు ఈ సభల్లో పాల్గొని సమస్యలను నేరుగా తెలియజేయాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల మండలంలో 14 రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ శాఖ అధికారి బి.సోమశేఖర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 613 మంది రైతుల నుంచి ఇప్పటి వరకూ 682 టన్నులు ధాన్యాన్ని సేకరించామని తెలిపారు. వీటి విలువ రూ.14.45 కోట్లు ఉంటుందన్నారు. ధాన్యం డబ్బులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ అవుతాయన్నారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ అధికారి బి.సోమశేఖర్, సిబ్బంది ఉన్నారు.

ఆర్‌టిసికి రూ.32 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

కార్తీక మాసంలో ప్రత్యేక సర్వీసులు నడపడం వల్ల ఆర్‌టిసికి రూ.32 లక్షల ఆదాయం సమకూరిందని జిల్లా ప్రజా రవాణా అధికారి వైఎస్ఎన్.మూర్తి తెలిపారు. కార్తీక మాసంలో శబరిమలకు 8 బస్సులు, పంచారామాలకు 13 బస్సులు, ఏకాదశి రుద్రులు, నవ నందులు, శివ కేశవ దర్శిని, కోనసీమ స్పెషల్స్‌గా 15 బస్సులు, మొత్తంగా 36 బస్సులు 50 వేల కిలోమీటర్లు మేర నడిపామన్నారు. వీటి ద్వారా సుమారుగా రూ.32 లక్షల ఆదాయం వచ్చినది. అయ్యప్ప భక్తులు నాలుగు డిపోల నుంచి మరికొన్ని శబరిమల యాత్ర బస్సులు బుక్ చేసుకున్నారన్నారు. ధనుర్మాసంలో ప్రత్యేక యాత్రా బస్సులు నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్


ఉద్యోగుల సమస్యలను వింటున్న డిఆర్‌ఒ

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో ప్రభుత్వ ఉద్యోగుల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడవ శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ డే నిర్వహింస్తున్నామన్నారు. సంబంధిత శాఖలను సమన్వయం చేసి ఉద్యోగుల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని తెలిపారు. మొత్తం 21 మంది ఉద్యోగులు ఫిర్యాదులు అందించారన్నారు. గత ఉద్యోగుల గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలపై నివేదిక అనంతరం చర్యలపై సమీక్ష నిర్వహించామన్నారు. కలెక్టర్ ఆదేశాలతో మహిళా ఉద్యోగుల కోసం ప్రభుత్వ కార్యాలయాల్లో వాష్‌రూమ్ సౌకర్యాల ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఉద్యోగుల న్యాయబద్ధమైన వినతులపై చర్యలు కొనసాగుతాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి మహ్మద్ అలీ, జిల్లా ట్రెజరీ అధికారి ఎన్. సత్యనారాయణ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె.ఎన్. జ్యోతి హౌసింగ్ పిడి నాతి బుజ్జి, డివిజనల్ పంచాయతీ అధికారి ఎం నాగలత, ఇతర శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్

ప్రజాశక్తి - కొవ్వూరు

నియోజకవర్గంలో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని పరిష్కరించాలనే ఉద్దేశ్యంతోనే ప్రతి శుక్రవారం గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నామని ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో 11 ఫిర్యాదుల అందినట్లు ఆయన తెలిపారు. ప్రధానంగా పింఛన్లు రెవెన్యూపరమైన సమస్యలతో పాటు చాగల్లులో డెస్టిలరీ సమీపంలో ఉన్న పంట కాలువ పూడుక తీయించాలని, మల్లవరంలో వెంకటేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మించాలని, తోకములో సీసీ డ్రైన్లు నిర్మించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. ఆయా శాఖ అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌ఎ సూచించారు. అనంతరం టిడిపి కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇకనుంచి ప్రతి శుక్రవారం నియోజకవర్గంలో కార్యకర్తల సమస్యలు తెలుసుకునేందుకు గ్రీవెన్స్ డే నిర్వహిస్తామన్నారు. నేరుగా కార్యకర్తలు ఏవైనా సమస్యలు ఉంటే ప్రతి ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ సేకరిస్తామన్నారు. ఎప్పుడైనా తనను సంప్రదించవచ్చునని ఆయన సూచించారు. కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండదండగా ఉంటుందని ఆయన సూచించారు. ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, మండల పార్టీ అధ్యక్షుడు బేతిన నారాయణ, వేమగిరి వెంకట్రావు, పెనుమాక జయరాజు తదితరులు పాల్గొన్నారు.